RNI: TELTEL12215
https://youtube.com/@PrabhathasuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

RANGAREDDY, EDITION : 01, VOLUME :204 EDITOR: CHERUKU UPENDAR, DATE : SATURDAY 09 DECEMBER 2023 PAGES:4 RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 204 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : శనివారం 09 డిసెంబర్ 2023 పేజీలు : 4 వెల : 5/-

## ఒడిషా టు హర్యానాకు గంజాయి

### ఇద్దరిని అరెస్టు చేసిన ఎస్‌వోటీ పోలీసులు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు




ఒడిషాలో గంజాయిని కొనుగోలు చేసి హైదరాబాద్ శివారు ప్రాంతాల నుంచి హర్యానాకు తరిలిస్తున్న ఇద్దరిని ఎస్‌ఓటీ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.8 వేలతోపాటు 510కిలోల గంజాయి, ఆటో గూడ్స్‌వాహనం, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం

మిగతా 2లో

# సభా సమయం షురూ..!



## మిజోరంలో కొలువుదీరిన
## కొత్త ప్రభుత్వం

- ముఖ్యమంత్రిగా లాల్‌దుహెూమా ప్రమాణ స్వీకారం
- గెలిచిన మూడు రాష్ట్రాల్లోనూ ముఖ్యమంత్రుల ఎంపికే పూర్తి చేయని బిజెపి

ఐజ్వాల్ - ప్రభాత సూర్యుడు


మిజోరం నూతన ముఖ్యమంత్రిగా జోరామ్ పీపుల్స్ మూవ్‌మెంట్ (జెడ్‌పిఎం) నాయకులు లాల్‌దుహెూమా శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ కంభంపాటి హరిబాబు లాల్‌దుహెూమా చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో 11 మంది జెడ్‌పిఎం ఎమ్మెల్యేలు కూడా మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మాజీ ముఖ్యమంత్రి, మిజో నేషనల్ ఫ్రంట్ (ఎంఎన్‌ఎఫ్)

మిగతా 2లో

- నేడు శాసనసభలో ఎమ్మెల్యేల ప్రమాణం
- ప్రొటెం స్పీకర్‌గా అక్బరుద్దీన్ నియామకం
- దూరంగా ఉంటామన్న బీజేపీ ఎమ్మెల్యేలు
- అనారోగ్య కారణాలతో మాజీ సీఎం కేసీఆర్ కూడా
- మహాలక్ష్మి పథకం ప్రారంభించనున్న సీఎం రేవంత్

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



ఎన్నికల సమరం పరిసమాప్తమై కాంగ్రెస్ సారథ్యంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరిన వేళ%ా%ఇక సభా సమరం షురూ కానుంది. శనివారం రాష్ట్ర మూడో శాసనసభ సమావేశమవుతోంది. గత పదేండ్లుగా బీఆర్‌ఎస్ ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచిన అసెంబ్లీ ఈసారి కాంగ్రెస్ నేతృత్వంలో తొలిసారిగా భేటీ కానుంది. ముఖ్యమంత్రి హెూదాలో ఎనుముల రేవంత్‌రెడ్డి మొదటిసారిగా సభలో అడుగుపెట్టనున్నారు. ఇరుపార్టీల్లో సీనియర్లు, ఎంతో అనుభవం గడించిన నేతలు సభకు హాజరుకానున్నారు. ఎనిమిదిసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన కేసీఆర్, ఆయన తర్వాత అత్యధిక సార్లు ఎన్నికైన హరీశ్‌రావు, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, ఆ తర్వాత స్థానాల్లో వరుసగా తలసాని శ్రీనివాసయాదవ్, దానం నాగేందర్ సీనియర్లుగా ఉన్నారు. వీరంతా

## సీఎంకు వినతుల వెల్లువ

- ప్రజా దర్బార్ కిటకిట
- వికలాంగులకు ప్రాధాన్యతనిచ్చిన రేవంత్
- సమస్యలు పరిష్కరిస్తామంటూ హామీ
- మంచినీరు, టెంట్లు తదితర ఏర్పాట్లు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తొలిరోజు ప్రజాదర్బార్ కిటకిటలాడింది. వివిధ జిల్లాల నుంచి వేలాదిగా తరలొచ్చిన ప్రజానీకంతో హైదరాబాద్ బేగంపేటలోని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ (నిన్నటి వరకూ ప్రగతి భవన్) కిక్కిరిసిపోయింది. రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన మరుసటి రోజైన శుక్రవారం నిర్వహించిన ఈ దర్బార్‌కు విశేష స్పందన లభించింది. ఉదయం 7 గంటల నుంచే జనం పెద్ద ఎత్తున తరలొచ్చారు. తమ సమస్యలతో కూడిన వినతిపత్రాలతో వారు క్యూ లైన్లలో నిలబడ్డారు. 9.30 గంటల ప్రాంతంలో అక్కడికి చేరుకున్న ముఖ్యమంత్రి మొదటగా వికలాంగులకు ప్రాధాన్యతనిచ్చారు.

మిగతా 2లో

## నేటి నుంచి మహిళలకు ఫ్రీ బస్ జర్నీ

- ట్రాన్స్‌జెండర్స్‌కు కూడా..
- పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, ఆర్డినరీ, మెట్రోలైనర్‌లు ఎక్కొచ్చు
- రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా తిరగొచ్చు
- నివాస గుర్తింపు కార్డు చూపాలి
- పురుషులు, విద్యార్థుల కోసం స్పెషల్ బస్సులు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని శనివారం నుంచి ప్రారంభించాలని నిర్ణయించారు.

మిగతా 2లో

## 81 వేల కోట్ల అప్పు ఎందుకైంది?

### విద్యుత్ అధికారుల్ని ప్రశ్నించిన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు




విద్యుత్ శాఖ అప్పులు రూ.81వేల కోట్లకు పెరగడానికి కారణాలు ఏంటని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అధికారుల్ని ప్రశ్నించారు. ఇంత పెద్దమొత్తంలో అప్పులు చేస్తుంటే అధికారులుగా మీరెలా మౌనంగా ఉన్నారని అడిగారు. విద్యుత్ శాఖపై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో శుక్రవారంనాడాయన అధ్యక్షతన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం జరిగింది. రాష్ట్రంలో విద్యుత్ స్థితిగతులపై కూలంకషంగా చర్చించారు.

మిగతా 2లో

# రాహుల్.. పోటీ ఎక్కడ నుంచి..!

న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు




ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసాయి. ఇక ఇప్పుడు దేశంలోని అన్ని పార్టీల దృష్టి మరికొద్ది నెలల్లో జరగనున్న లోక్‌సభ ఎన్నికలపై పడింది. దేశంలోని జాతీయ హోదా కల్గిన ప్రధాన రాజకీయ పార్టీలు, కూటములు ఇప్పటి నుంచే ఎన్నికల వ్యూహ, ప్రతివ్యూహాల్లో మునిగిపోయాయి. ఈ స్థితిలో కాంగ్రెస్ పార్టీ కీలక నేత రాహుల్ గాంధీ ఈసారి ఎక్కణ్ణుంచి పోటీ చేస్తారన్న అంశం ఆసక్తి రేకెత్తిస్తోంది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఆయన ఉత్తర్‌ప్రదేశ్‌లోని అమేఠీతో పాటు కేరళలోని వాయనాడ్‌లో పోటీ చేశారు. గాంధీ కుటుంబానికి కంచుకోటగా చెప్పుకునే అమేఠీలో రాహుల్ గాంధీ భారతీయ జనతా పార్టీ (బీజేపీ)కి చెందిన స్మృతి ఇరానీ చేతిలో ఓడిపోగా, వాయనాడ్‌లో గెలుపొంది పరువు దక్కించుకున్నారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఘోర పరాజయం పాలైన తర్వాత.. రాహుల్ గాంధీకి మిత్రపక్షాలు, రాజకీయ విశ్లేషకులు సహా సమాజంలోని వివిధ వర్గాల నుంచి అనేక సలహాలు, సూచనలు అందుతున్నాయి. ముఖ్యంగా రాహుల్ ఎక్కణ్ణుంచి పోటీ చేయాలన్న విషయంపై ఒక్కొక్కరు ఒక్కోలా సలహాలిస్తున్నారు.రాహుల్ గాంధీ ఈసారి కేరళ (వాయనాడ్) నుంచి కాకుండా హిందీ బెల్ట్ రాష్ట్రాలుగా పేరొందిన ఉత్తరాది రాష్ట్రాల్లోనే ఎక్కడో ఒక చోట నుంచి పోటీ చేయాలని భారత కమ్యూనిస్ట్ పార్టీ (సీపీఐ) ప్రధాన కార్యదర్శి డి. రాజా సూచిస్తున్నారు. హిందీ మాట్లాడే రాష్ట్రాల్లో బలమైన శక్తిగా మారిన బీజేపీకి వీలైనంత గట్టి కౌంటర్ ఇవ్వాలంటే రాహుల్ గాంధీ అక్కణ్ణించి పోటీ చేయడమే ఉత్తమమని ఆయన అభిప్రాయపడుతున్నారు. ఎ.ఔ.ఆ.ఎ.ంకూటమిలో మిత్రపక్షంగా ఉన్న సీపీఐ చేస్తున్న ఈ సూచనకు కారణం.. కేరళలో కాంగ్రెస్, కమ్యూనిస్టులు రెండూ బీజేపీ వ్యతిరేక విపక్ష కూటమిలోనే ఉన్నాయి. ఆ రాష్ట్రంలో కాంగ్రెస్, సీపీఐ, సీపీఐ(ఎం) బలమైన పార్టీలు. అసెంబ్లీ ఎన్నికల విషయంలోనే కాంగ్రెస్, కమ్యూనిస్టుల మధ్య వైరం ఉంటుంది తప్ప లోక్‌సభ ఎన్నికలకు ఈసారి ఎలాగూ కలిసే పోటీ చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో రాహుల్ అక్కడ పోటీ చేసినా చేయకపోయినా ఎవరికీ వచ్చే నష్టమూ లేదు, అదనంగా ఒనగూరే ప్రయోజనమూ లేదు. అందుకే ఉత్తర్‌ప్రదేశ్, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో పోటీ చేస్తే బీజేపీకి వ్యతిరేకంగా గట్టి పోటీ ఇవ్వవచ్చన్నది డి. రాజా మనోగతం. అంతేకాదు, పదేళ్ల బీజేపీ పాలనపై ఏర్పడే వ్యతిరేకత, కాంగ్రెస్ ఓటుబ్యాంకుకు తోడయ్యే మిత్రపక్షాల ఓట్లు.. అన్నీ కలగలిసి బీజేపీ ఖాతాలో పడే సీట్లను లాక్కోవచ్చు అనే వ్యూహం కూడా

ఇందులో దాగి ఉంది.డి. రాజా ఈ మాట చెప్పడానికి కూడా కారణం ఉంది. 2014లో నాటి గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న నరేంద్ర మోదీ తన సొంత రాష్ట్రం గుజరాత్‌లో వడోదరతో పాటు ఉత్తర్‌ప్రదేశ్‌లో వారణాసి నుంచి కూడా పోటీ చేశారు. రెండు చోట్లా గెలుపొందిన ఆయన వారణాసి సీటులో ఎంపీగా కొనసాగాలని నిర్ణయించుకుని, వడోదర వదులుకున్నారు. మోదీ పోటీ చేయకముందు ఉత్తర్‌ప్రదేశ్‌లో బీజేపీ ప్రభావం అంతగా ఉండేది కాదు. సమాజ్‌వాదీ, బహుజన్ సమాజ్ పార్టీ, కాంగ్రెస్ పార్టీల ప్రభావం ఎక్కువగా ఉండేది. మోదీ వారణాసి నుంచి పోటీ చేయడం కారణంగా ఉత్తర్‌ప్రదేశ్ ఒక్కటే కాదు పక్కనే ఉన్న బిహార్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాలపై కూడా ప్రభావం పడింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని మొత్తం 80 సీట్లలో బీజేపీ ఏకంగా 73 సీట్లు గెలుపొంది ప్రతిపక్షాలను మట్టికరిపించింది. దేశవ్యాప్తంగా క్రేజ్ సంపాదించుకున్న నేత పోటీ చేయడం కారణంగా ఆ నియోజకవర్గంతో పాటు యావత్ ప్రాంతాన్ని ప్రభావితం చేసింది. రాహుల్ గాంధీ కూడా 2019లో ఇదే సూత్రాన్ని అనుసరించి అమేఠీ (యూపీ)తో పాటు వాయనాడ్ (కేరళ)లో కూడా పోటీ చేశారు. దేశం మొత్తమ్మీద 52 సీట్లు మాత్రమే గెలుచుకోగా.. అందులో అత్యధికంగా 15 సీట్లు ఒక్క కేరళ రాష్ట్రం నుంచే వచ్చాయి. అందుక్కారణం రాహుల్ గాంధీ ఆ రాష్ట్రం నుంచి పోటీ

మిగతా 2లో

## స్పీకర్ గా గడ్డం



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణీస్వీకారం చేశారు. గురువారం మధ్యాహ్నం ఎల్బీ స్టేడియంలో రేవంత్ రెడ్డితా పాటు? పలువురు మంత్రులతో గవ్నరర్ తమిళిసై ప్రమాణం చేయించారు. ఇక ఇదిలా ఉంటే? స్పీకర్ పదవి ఎవరికి దక్కుతుందనే దానిపై అందరిలోనూ ఆసక్తిని రేపింది. ఈ పదవిని ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్‌ను స్పీకర్ గా ఎంపిక చేసింది కాంగ్రెస్ అధినాయకత్వం. రేపోమాపో ఆయన? స్పీకర్ గా బాధ్యతలు చేపట్టనున్నారు.రాష్ట్ర ఏర్పాటు తర్వాత తొలి అసెంబ్లీ స్పీకర్ గా మధుసూదన చారికి అవకాశం దక్కగా? 2018లో పోచారం శ్రీనివాస్ రెడ్డి వ్యవహరించారు. తెలంగాణలో కాంగ్రెస్ కు తొలిసారి అధికారం దక్కగా? గడ్డం ప్రసాద్ కుమార్ కు దక్కినట్లు అయింది.గడ్డం ప్రసాద్ కుమార్ గతంలో మంత్రిగా కూడా పని చేశారు. ఇయన వికారాబాదు జిల్లా మర్పల్లి గ్రామంలో జన్మించారు. దళిత సామాజిక వర్గానికి చెందిన గడ్డం ప్రసాద్ కుమార్.. రంగారెడ్డి జిల్లా మర్పల్లిలో జన్మించారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న గడ్డం ప్రసాద్.. 2008 ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా వికారాబాద్ నుంచి పోటీ చేసి

మిగతా 2లో

## స్పీకర్ గా గడ్డం

(మొదటిపేజీ తరువాయి)

తొలిసారి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి కేబినెట్‌లో గడ్డం ప్రసాద్ మంత్రిగా పనిచేశారు. 2012లో సీఎంగా చేసిన కిరణ్ కుమార్ రెడ్డి కేబినెట్‌లోనూ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు.ఆ తర్వాత వచ్చిన 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో గడ్డం ప్రసాద్ కుమార్ వరుస ఓడిపోయారు. 2022లో టీపీసీసీ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు. కాగా.. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ.. వికారాబాద్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. రెండు సార్లు మంత్రిగా చేసిన అనుభవం ఉండడంతో కాంగ్రెస్ అధిష్ఠానం గడ్డం ప్రసాద్ కుమార్‌కు స్పీకర్ బాధ్యతలు అప్పగించింది. తాండూర్ లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1984లో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. 2008లో జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి తన సమీప ప్రత్యర్థి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బి. సంజీవరావు పై గెలిచి తొలిసారి అసెంబ్లీకి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాడు. ఇక 2009లో జరిగిన ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి తన సమీప ప్రత్యర్థి ఎ.చంద్రశేఖర్ పై(టీఆర్ఎస్) 4,859 ఓట్ల మెజారిటీతో గెలిచి రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచారు.గడ్డం ప్రసాద్ కుమార్ 2012లో నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి క్యాబినెట్ లో టెక్స్‌టైల్ శాఖ మంత్రిగా పని చేశారు.2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మెతకు ఆనంద్ పై పోటీ చేసి వికారాబాద్ స్థానం నుంచి గెలిచారు.

## మిజోరంలో కొలువుదీరిన కొత్త ప్రభుత్వం

(మొదటిపేజీ తరువాయి)

నాయకులు జోరంతంగా కూడా హాజరయ్యారు. ఎంఎన్ఎఫ్ శాసనసభా పక్షనేత లాల్ చందమా రాల్టేతోసహా ఆ పార్టీ ఎమ్మెల్యేలంతా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మరో మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నాయకులు లాల్ థన్వాలా కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఇటీవల మిజోరంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 40 స్థానాలకు గాను జెడ్‌పిఎం 27 స్థానాల్లో విజయం సాధించింది. ఈ నెల 5న జరిగిన సమావేశంలో లెజిస్లేచర్ పార్టీ నాయకుడిగా లాల్‌దు హెూమాను, ఉప నాయకుడిగా కె.సప్డంగను ఎన్నుకున్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 8 స్థానాలు గెలుచుకున్న జెడ్‌పిఎం తాజా ఎన్నికల్లో 27 స్థానాలు సాధించింది. ఎంఎన్ఎఫ్ 10 స్థానాల్లో విజయం సాధించింది. ఇటీవల మిజోరంతో సహా ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగాయి. మిజోరంలో జెడ్‌పిఎం, తెలంగాణలో కాంగ్రెస్ విజయం సాధించిగా, ఈ రెండు రాష్ట్రాల్లోనూ కొత్త ప్రభుత్వాలు కొలువుతీరాయి. బిజెపి విజయం సాధించిన మిగతా మూడు రాష్ట్రాలు ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లో ఇంకా ముఖ్యమంత్రుల ఎంపికే ప్రారంభం కాలేదు.

## ఒడిషా టు హర్యానాకు గంజాయి

(మొదటిపేజీ తరువాయి)

చేసుకున్నారు. వాటి విలువ రూ.1,28,50,000 ఉంటుందని పోలీసులు తెలిపారు. శుక్రవారం రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీ డీఎస్ చౌహాన్ వివరాలు వెల్లడించారు. జమ్మూకాశ్మీర్‌కు చెందిన మోహన్, హర్యానాకు చెందిన ప్రవీణ్‌కుమార్ స్నేహితులు. ఇద్దరూ కలిసి గంజాయి స్మగ్లింగ్ చేయాలని పథకం వేశారు. ఇందులో భాగంగా ఒడిషాలో తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేస్తున్న నిందితులు మనోహర్ అనే స్నేహితునితో కలిసి హర్యానాలోని హిస్సార్ ప్రాంతానికి సరఫరా చేస్తున్నారు. సమాచారం అందుకున్న మల్కాజ్‌గిరి ఎస్‌ఓటీ పోలీసులు రాచకొండ శివారు ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా వేశారు. మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఆటో ట్రాలీ వాహనాన్ని తనిఖీ చేయగా అందులో గంజాయి లభ్యమైంది. ఇద్దరు నిందితులను అరెస్టు చేసిన విచారించారు. గూడ్స్‌ట్రాలీలో ప్రత్యేక క్యాబిన్‌ను ఏర్పాటు చేసిన గంజాయిని తరలిస్తున్నారు. ఎస్‌ఓటీ పోలీసులను సీపీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమావేశంలో డీసీపీలు డి.జానకి, గిరిధర్, అదనపు డీసీపీ ఎస్.సూర్యనారాయణ, ఏసీపీ వాసు, ఇన్‌స్పెక్టర్స్ రాములు, సైదులు, ఎస్ఐ పరమేశ్వర్ తదితరులు ఉన్నారు.

## రాహుల్.. పోటీ ఎక్కడ నుంచి..!

(మొదటిపేజీ తరువాయి)

చేయడమే.ఇప్పుడు దక్షిణాదిన ఇండియా కూటమి బలంగానే ఉంది. ముఖ్యంగా తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో బీజేపీకి అసలు పట్టు లేదు. బలం పెంచుకునేందుకు తీవ్రంగా శ్రమిస్తోంది. ఈ పరిస్థితుల్లో రాహుల్ అక్కడ పోటీ చేయడం వల్ల ఒరిగేదేమీ లేదు. అందుకే ఉత్తరాదిన పోటీ చేసి, బీజేపీ జైత్రయాత్రకు బ్రేకులు వేయాలని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా సూచిస్తున్నారు. రాజా సూచన సంగతి సరే.. ఆయన చెప్పినట్టు ఉత్తరాదిన ఎక్కడో ఒక చోట నుంచి రాహుల్ గాంధీ పోటీ చేస్తే.. ఆ సీటు కచ్చితంగా గెలిచి తీరాలి. లేదంటే ఆయన పార్లమెంటులోకి అడుగు పెట్టడానికి కూడా వీలుకాదు. అంటే ఆయన గెలుపుపై గ్యారంటీ ఇచ్చే ఒక సేఫ్ సీట్ కావాలి. కంచుకోట అనుకున్న అమేఠీలోనే బీజేపీ పాగా వేయగలిగింది. ఈ పరిస్థితుల్లో రాహుల్ ఉత్తరాదిన ఎక్కణ్ణుంచి పోటీ చేసినా సరే.. బీజేపీ ఆ సీటుపై ప్రత్యేక దృష్టి పెట్టి, అస్త్ర, శస్త్రాలన్నీ ప్రయోగించి ఓడించేందుకు శతవిధాలుగా ప్రయత్నిస్తుంది. అదే బీజేపీకి పెద్దగా పట్టులేని తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాల్లో బీజేపీ ఏం చేసినా సరే వారి పప్పులు ఉడకవు అన్న అభిప్రాయం రాహుల్ గాంధీ కోటరీలో ఉంది. అందుకే ఈసారి కూడా 'వాయనాడ్'ను సేఫ్ సీటుగా ఉంచుకుని, ఉత్తరాదిన మరో సీటు చూసుకోవడం బెటర్ అని ఆలోచిస్తున్నారు. ఈసారి వయోభారం, అనారోగ్యం రీత్యా సోనియా గాంధీ లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేయకపోవచ్చు. అలాంటప్పుడు ఆమె ప్రాతినిథ్యం వహిస్తున్న రాయ్ బరేలీనుంచి పోటీ చేయాలని కొందరు సూచిస్తున్నారు. తద్వారా రెండు చోట్ల గెలిస్తే దక్షిణాది సీటు వదులుకోవచ్చని, ఉప-ఎన్నికలు వచ్చినా బీజేపీ గెలిచే అవకాశం ఉండదు అన్నది రాజకీయ వ్యూహకర్తల అభిప్రాయం. ఇది ప్లాన్-ఏ.ఒకవేళ ప్రియాంక గాంధీ కూడా ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తే.. సోనియా గాంధీ సీటును ఆమెకు ఇవ్వొచ్చు. అలాంటప్పుడు యూపీలో మరేదైనా బలమైన సీటులో పోటీ చేయాల్సి ఉంటుంది. అమేఠీలో బీజేపీ గెలుపొందిన తర్వాత ఆ ప్రాంతంపై అటు రాష్ట్ర ప్రభుత్వం, ఇటు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి ఓటర్లను తమ వైపు కట్టిపడేసుకునే ప్రయత్నం చేస్తున్నాయి.

# సభా సమయం షురూ..!

(మొదటిపేజీ తరువాయి)

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాబట్టి వారిని ప్రొటెం స్పీకర్‌గా నియమించడానికి కొత్త ప్రభుత్వం ఇష్టపడ లేదు. కాంగ్రెస్ నుంచి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు కూడా అత్యధికసార్లు గెలిచిన వారిలో ఉన్నా వారిద్దరూ మంత్రులుగా ఉండటంతో ప్రొటెం స్పీకర్‌గా నియమించడం సాధ్యం కాదని తెలిసింది. ఈ కారణంగా ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీని (వరుసగా ఆరుసార్లు అసెంబ్లీ ఎన్నిక కావడంతో) ప్రొటెం స్పీకర్‌గా నియమించారు. ఈమేరకు శనివారం ఉదయం 8.30 గంటలకు రాజ్‌భవన్‌లో గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. మరోవైపు నూతన ఎమ్మెల్యేలు శనివారం శాసనసభలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈమేరకు గవర్నర్ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రొటెం స్పీకర్‌గా అక్బర్ ప్రమాణం చేసిన తర్వాత ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్న శాసనసభలో ఆయన ఎమ్మెల్యేలతో ప్రమాణ స్వీకారం చేయిస్తారు. ఈ కార్యక్రమానికి మాజీ సీఎం కేసీఆర్ దూరంగా ఉండనున్నారు. బాత్రూంలో కాలుజారి కిందపడటం వల్ల ఆయన ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సంగతి తెలిసిందే. ఆయన శాసనసభకు వచ్చే అవకాశం లేదని బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి. ప్రొటెం స్పీకర్‌గా అక్బరుద్దీన్ వ్యవహరిస్తుండటంతో ఆయన సమక్షంలో ప్రమాణం చేయలేమంటూ బీజేపీ ఎమ్మెల్యేలు స్పష్టం చేశారు. 2018లో కూడా బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ ఇదే విధంగా వ్యవహరించారు. ఆ తర్వాత స్పీకర్‌గా ఎన్నికైన పోచారం శ్రీనివాసరెడ్డి సమక్షంలో ఆయన ప్రమాణం చేసిన సంగతి తెలిసిందే. శనివారం శాసనసభ వాయిదా అనంతరం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన మహాలక్ష్మి పథకాన్ని (మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం) సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ ప్రాంగణంలో ప్రారంభిచనున్నారు. అక్కడి నుంచి నేరుగా నిమ్స్‌కు వెళ్లి ఆరోగ్యశ్రీ పథకాన్ని కూడా (ఆ పథకానికి ఉన్న ఆర్థిక పరిమితి పెంపు) ప్రారంభించనున్నారు.

**అసెంబ్లీ పరిసరాల్లో ఆంక్షలు**

కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారిగా శాసనసభ భేటీ కానున్న నేపథ్యంలో శనివారం ఉదయం 7 గంటల తర్వాత ఆయా పరిసరాల్లో ఆంక్షలు ప్రారంభం కానున్నాయి. పబ్లిక్ గార్డెన్‌తోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో వాకింగ్ చేసే ప్రజానీకం ఉదయం 6 గంటల లోపే తమ నడకను ముగించుకోవాలని అసెంబ్లీ కార్యాలయం సూచించింది.

# సీఎంకు వినతుల వెల్లువ

(మొదటిపేజీ తరువాయి)

వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకుని, విజ్ఞాపన పత్రాలను స్వీకరించారు. వాటిని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపడతామంటూ హామీనిచ్చారు. ఉదయం 11.15 గంటల వరకూ ఈ కార్యక్రమాన్ని ఆయన కొనసాగించారు. సీఎంతోపాటు మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దనసరి అనసూయ (సీతక్క), ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి తదితరులు దర్బార్‌లో ఉన్నారు. అనంతరం సచివాలయంలో అత్యవసర సమీక్షా సమావేశాల కోసం ముఖ్యమంత్రి సెక్రటేరియట్‌కు బయల్దేరి వెళ్లారు. ఆ తర్వాత సీతక్క ప్రతి ఒక్కరి నుంచీ వినతిపత్రాలను స్వీకరించారు. మరోవైపు ప్రజా దర్బార్ నిర్వహణకు ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లను పూర్తి చేసింది. ముఖ్యమంత్రి కార్యాలయం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, డీజీపీ రవిగుప్తా, జలమండలి ఎమ్‌డీ దానకిశోర్, జీహెచ్ఎమ్‌సీ కమిషనర్ రొనాల్డ్ రోస్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ తదితర అధికారులు ప్రజాదర్బార్ నిర్వహణను సమన్వయం చేశారు.

**రిజిస్ట్రేషన్లకు 15 ప్రత్యేక డెస్కులు**

గ్రీవెన్సు రిజిస్ట్రేషన్లకు ప్రత్యేకంగా 15 డెస్కులను అధికారులు ఏర్పాటు చేశారు. ప్రతీ విజ్ఞాపన పత్రాన్ని ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేసి, ప్రత్యేక గ్రీవెన్స్ నెంబరును కేటాయించారు. దరఖాస్తుదారులకు ప్రింటెడ్ ఎకనాలెడ్జ్‌మెంట్ ఇవ్వటంతోపాటు ఎస్ఎమ్ఎస్‌లను కూడా పంపే ఏర్పాటు చేశారు. ప్రజా దర్బార్ కోసం వచ్చే ప్రజలు కూర్చోవటానికి వీలుగా లోపల 320 కుర్చీలను అధికారులు ఏర్పాటు చేశారు. బయట క్యూ లైన్లను, ఎండ నుంచి రక్షణ కోసం టెంట్లను, మంచినీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. సీఎం ప్రమాణం స్వీకారం చేసిన మరుసటి రోజే ప్రజా దర్బార్‌ను నిర్వహించటంతో అధికారులు తమ శక్తి మేరకు ఏర్పాట్లు చేసినప్పటికీ కొన్ని లోపాలు చోటు చేసుకున్నాయి. దర్బార్ లోపలికి వెళ్లేందుకు తమకు అనుమతినియ్యలేదంటూ కొందరు మహిళలు ప్రజా భవన్ ముందు ఆందోళనకు దిగారు. చాలా దూరంలో ఉన్న జిల్లాల నుంచి తాము సీఎంకు వినతిపత్రాలు ఇవ్వటానికి వస్తే సమయం లేదంటూ తిప్పి పంపటమేంటని వారు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. 'మొదటి రోజు కాబట్టి కొంత అసౌకర్యం కలిగింది. మున్ముందు ఇలాంటివి జరక్కుండా చూసుకుంటాం అని పోలీసులు వారికి సర్ది చెప్పారు. వచ్చిన దరఖాస్తుల్లో పింఛన్లు, ఇండ్లు, ఇండ్ల స్థలాలు, విద్య, వైద్య సహాయాలు తదితరాంశాలకు సంబంధించినవే ఎక్కువగా ఉన్నాయని అధికారులు ఈ సందర్భంగా తెలిపారు.

**రోజుకో మంత్రి..ఎమ్మెల్యే జిల్లాకో అధికారి : సీఎం రేవంత్ నిర్ణయం**

ప్రజా దర్బార్ తొలి రోజు అనుభవంతో సీఎం రేవంత్ ఆ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు కీలక నిర్ణయాలు తీసుకోబుతున్నట్టు సమాచారం. తాము ఊహించిన దానికంటే ఎక్కువగా, అంచనాలకు మించి దర్బార్‌కు జనం వచ్చారని ఆయన అధికారులతో వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో దర్బార్‌కు ఎలాంటి ఆటంకాలు లేకుండా, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా అది సజావుగా కొనసాగేలా చూడాలంటూ వారిని ఆయన ఆదేశించారు. సమస్యల పరిష్కారానికి ఎక్కువ సమయం తీసు కోకుండా, సులభంగా ఉండేందుకు వీలుగా రోజుకో మంత్రి, ఎమ్మెల్యే దర్బార్‌లో ఉండేలా నిర్ణయించాలని ఆయన భావిస్తున్నట్టు తెలిసింది. దీంతోపాటు జిల్లాల వారీగా దరఖాస్తుదారులను, వారి అర్జీలను విడగొట్టి.. ఒక్కో జిల్లాకు ఒక్కో ప్రత్యేక అధికారిని నియమిం చేందుకు ఆయన కసరత్తు చేయాలంటూ ఉన్నతాది, కారులకు సూచించారు. తద్వారా త్వరితగతిన దర ఖాస్తులు పరిష్కరమయ్యేలా చూడాలంటూ ఆదేశించారు.

# నేటి నుంచి మహిళలకు ఫ్రీ బస్ జర్నీ

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి నేటి మధ్యాహ్నం 1.40 గంటలకు అసెంబ్లీ ఆవరణ నుంచి ఈ బస్సు సర్వీసుల్ని ప్రారంభిస్తారు. ఆయనతోపాటు మహిళా మంత్రులు అనసూయ సీతక్క, కొండా సురేఖ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, రవాణాశాఖ కార్యదర్శి వాణీ ప్రసాద్‌తో పాటు పలువురు మహిళా ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ హామీ అమలు సాధ్యాసాధ్యాలపై సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం టీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్‌తోపాటు ఇతర ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. విధివిధానాలపై కసరత్తు చేశారు. అనంతరం రవాణాశాఖ కార్యదర్శి వాణి ప్రసాద్ దీనిపై అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో, హైదరాబాద్ సిటీలో ఆర్డినరీ, మెట్రోలైనర్ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణం చేయవచ్చు. దీనిపై సజ్జనార్ బస్‌భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో పూర్తిస్థాయి వివరణ ఇచ్చారు. ఉచిత ప్రయాణానికి ప్రజలు సహకరించాలని కోరారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలతో పాటు బాలికలు, విద్యార్థినులు, ట్రాన్స్‌జెండర్‌లు ఉచితంగా ప్రయాణించవచ్చని తెలిపారు. ఈ ఉచిత ప్రయాణం తెలంగాణ రాష్ట్ర నివాసిత మహిళలకే వర్తిస్తుందనీ, దానికోసం బస్సులో కండక్టర్‌కు స్థానికత ధృవీకరణ కోసం ఆధార్‌కార్డు లేదా ఓటరు గుర్తింపు కార్డు, పాన్‌కార్డు, రేషన్‌కార్డు వంటివి చూపితే సరిపోతుందని వివరించారు. ఇన్ని కిలోమీటర్లే ప్రయాణ పరిధి అనే నిబంధనలు ఏమీ లేవన్నారు. రాష్ట్ర సరిహద్దుల వరకు మహిళలు, ప్రభుత్వ, ప్రయివేటు ఉద్యోగినులు, బాలికలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేయవచ్చన్నారు. వారం తర్వాత బస్సుల్లో ప్రయాణించే ప్రతి మహిళకు జీరో టికెట్ ఇస్తామన్నారు. రోజుకు ఎంతమంది మహిళలు ప్రయాణిస్తున్నారో లెక్క తేలాల్సి ఉంటుందనీ, ఆ ప్రకారమే ప్రభుత్వ రీయింబర్స్‌మెంట్ సొమ్ము చెల్లిస్తుందని చెప్పారు. ప్రతిష్టాత్మకమైన ఈ నిర్ణయం అమలు కోసం క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే దాదాపు 40 వేల మంది డ్రైవర్లు, కండక్టర్లతో ఇప్పటికే రెండుసార్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించామన్నారు. ఉచిత ప్రయాణంతో బస్సుల్లో రద్దీ పెరిగే అవకాశమున్నదనీ, బస్ స్టేషన్ల నిర్వహణపై దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించామన్నారు. సిబ్బంది క్రమశిక్షణతో వ్యవహరించాలనీ, ఓపిక, సహనంతో విధులు నిర్వర్తించాలని సూచించారు.

ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల వ్యక్తిగత వాహనాల వినియోగం తగ్గి, రోడ్లపై ట్రాఫిక్ రద్దీ నియంత్రణలో ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఆర్టీసీకి ప్రస్తుతం రోజుకు రూ.14 కోట్ల ఆదాయం వస్తున్నదనీ, ఇప్పుడు దానిలో సగం ఆదాయం తగ్గుతుందని భావిస్తున్నామనీ, ఆ మొత్తాన్ని ప్రభుత్వం రీయింబర్స్ చేస్తామని హామీ ఇచ్చిందని వివరించారు. ఇప్పటికే ఆర్టీసీలోకి 776 కొత్త బస్సులు వచ్చాయనీ, త్వరలో మరో 1,050 బస్సులు, వెయ్యి ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి రానున్నాయన్నారు. డ్రైవర్ల అవసరం ఉన్నదని ప్రభుత్వానికి నివేదించామనీ, దానికి సంబంధించి రిక్రూట్‌మెంట్ చేసేందుకు ప్రభుత్వం అంగీకరించిందన్నారు. వ్యక్తిగతంగానే తప్ప, టూర్ ప్యాకేజీలకు ఈ స్కీం వర్తించదని స్పష్టంచేశారు. వారం రోజులు అధ్యయనం చేశాక, అవసరమైతే పురుషులు, విద్యార్థుల కోసం ప్రత్యేక సర్వీసులు అందుబాటులోకి తెస్తామన్నారు. ప్రస్తుతం ఆర్టీసీ బస్సు ప్రయాణీకుల్లో 40 శాతం మహిళా ప్రయాణీకులు ఉన్నారనీ, వారి సంఖ్య ఇప్పుడు 55 శాతానికి పెరుగుతుందని అంచనా వేశామన్నారు. రద్దీని బట్టి షెడ్యూల్స్ సంఖ్య కూడా పెంచుతామన్నారు. ఇప్పటికే బస్ పాసులు తీసుకున్న మహిళలు, విద్యార్థినులకు ఎలాంటి రీయింబర్స్‌మెంట్ ఉండబోదని స్పష్టంచేశారు. కార్యక్రమంలో టీఎస్ఆర్టీసీ సీవోవో డాక్టర్ వీ రవీందర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు మునిశేఖర్, పురుషోత్తం, కష్ణకాంత్, వెంకటేశ్వర్లు, ఆర్థిక సలహాదారు విజయ పుష్ప, సీఎంఈ రఘునాథ రావు, సీటీఎం జీవన్‌ప్రసాద్ పాల్గొన్నారు.

# 81 వేల కోట్ల అప్పు ఎందుకైంది?

(మొదటిపేజీ తరువాయి)

మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ముఖ్యమంత్రి కార్యాలయం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకష్ణారావు, ఇంధన శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి సునీల్ శర్మ, జేఎమ్‌డీ శ్రీనివాసరావు, సింగరేణి సీఎమ్‌డీ ఎన్ శ్రీధర్, తెలంగాణ రాష్ట్ర దక్షిణ, ఉత్తర ప్రాంతాల విద్యుత్ పంపిణీ సంస్థల సీఎమ్‌డీలు జీ రఘుమారెడ్డి, ఏ గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా విద్యుత్ రంగ స్థితిగతులను వివరించారు. విద్యుత్ శాఖపై సమీక్ష సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి అనేక సందేహాలను వ్యక్తంచేశారు. వాటికి సమాధానం చెప్పే ప్రక్రియలో అధికారులు మౌనం వహించినట్టు తెలిసింది. ప్రధానంగా యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్) నిర్మాణం కోసం పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ), రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ (ఆర్ఈసీ) ద్వారా తీసుకున్న దాదాపు రూ.30వేల కోట్లకు పైగా నిధుల్ని కాళేశ్వరం ప్రాజెక్టుకు మళ్లించిన విషయంపై ఆరా తీసినట్టు తెలిసింది. వైటీపీఎస్ నిర్మాణ ఆలస్యానికి ఇది కూడా కారణమేనా అని సీఎం రేవంత్‌రెడ్డి అడిగినట్టు సమాచారం. దీనితో పాటు మరికొన్ని విద్యుత్ ప్లాంట్ల నిర్మాణం కోసం ఆర్థిక సంస్థల నుంచి అప్పులు తెచ్చి, వాటి దారిమళ్లింపుపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆయన అధికారుల్ని కోరినట్టు తెలిసింది. అలాగే డిస్కంలు పవర్ ఎక్స్ఛేంజ్‌ల నుంచి కొంటున్న విద్యుత్, ప్రయివేటు డెవలపర్స్ నుంచి కొంటున్న కరెంటు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని కూడా నివేదిక రూపంలో ఇవ్వాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి విద్యుత్ సంస్థలకు వచ్చిన నిధులు ఎన్ని? వాటిని ఎలా వినియోగించారు? అనే వివరాల్ని కూడా అడిగారు. విద్యుత్‌రంగంలో 2014కు ముందు ఉన్న పరిస్థితి ఆ తర్వాతి స్థితిగతులపై తనకు సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆయన అధికారుల్ని ఆదేశించారు. దీనిపై మరోసారి పూర్తిస్థాయి సమీక్ష చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు చెప్పారు. సమావేశానికి టీఎస్‌జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎమ్‌డీ ప్రభాకరరావు హాజరుకాలేదు.

సంపాదకీయం

# పెరుగుతున్న వంటింటి బిల్లు



రెండేళ్లుగా పేద, మధ్య తరగతి వర్గాలను ఎవర్ని కదిలించినా, పది మాటల్లో కనీసం రెండు మూడైనా పెరిగిన ధరల గురించే ఉంటున్నాయి. పెట్రోల్, వంట నూనె, కరెంట్ బిల్, పాల ప్యాకెట్.. వస్తువు ఏదైనా పెరుగుదల అనే పాయింట్ మాత్రం కామన్. తినడమూ, ఖర్చు పెట్టడమూ మానలేము. మన దేశంలో సామాన్యుడి భోజనం బిల్లు మళ్లీ పెరిగింది, ముద్ద మింగుడు పడడం లేదు. పెరుగుతున్న కూరగాయల రేట్లతో ఇటు శాఖాహారం, అటు మాంసాహారం రెండిటి బడ్జెట్ మారింది. నాన్-వెజ్ వండాలంటే టమాటాలు, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, మిర్చి, కొత్తిమీర వంటి వెజిటేరియన్ పదార్థాలు ఉండాలి. కాబట్టి, మాంసాహారం కోసం చేసే ఖర్చు కూడా పెరిగింది.క్రిసిల్ రోటీ రైస్ రేట్ ఇండెక్స్ ప్రకారం, గత నెలలో టమాటాలు, ఉల్లిపాయల ధరలు భారీగా పెరిగాయి. ద్రవ్యోల్బణం లాంటి పెద్ద పెద్ద మాటలు వాడకుండా, ఒక సామాన్య మధ్యతరగతి ఇల్లాలి దగ్గర కూర్చుని ధరల పెరుగుదల ఆమెను ఎలా ప్రభావితం చేసిందో తెలుసుకునే ప్రయత్నం చేశాం. రాజకీయ నాయకులు తరచూ మాట్లాడే, ధర్నాలు చేసే, గ్యాస్ సిలిండర్లు నెత్తిన పెట్టుకుని, ఎడ్ల బండిపై వెళుతూ చేసే ప్రదర్శనలన్నీ ఒకవైపు.. ఆర్టీసీ బస్సులో కూర్చునో, బైక్ పై వెళ్తూనో, షేర్ ఆటోలో నుంచి తొంగి చూసి ఆ ఆందోళనకు కారణం తెలుసుకుని నిట్టూర్చే మధ్య తరగతి, పేదలు మరోవైపు.క్రిసిల్ రీసెర్చ్ డేటాను బట్టి, గత నెలలో, ఇంట్లో వండే శాఖాహార వంటల బడ్జెట్ 10% పెరిగింది. అదే సమయంలో మాంసాహారం కోసం చేసే ఖర్చు 5% పెరిగింది. విడివిడిగా చూస్తే... నవంబర్ నెలలో ఉల్లిపాయల రేట్లు 93% పెరిగాయి, టొమాటో ధరలు 15% పెరిగాయి. ధరాఘాతం వల్ల... రోటీ, అన్నం, పప్పు, కూర, పెరుగుతో కూడిన సాధారణ శాఖాహార భోజనం తయారీ ఖర్చు గత సంవత్సరం నవంబర్ నెల కంటే ఈ సంవత్సరం నవంబర్ నెలలో 9% పెరిగింది. పప్పులది వెజ్ థాలీ ధరలో 9% వాటా. వీటి రేటు కూడా గత సంవత్సరం కంటే ఇప్పుడు 21% పెరిగాయి, భోజనం భారాన్ని పెంచాయి.నాన్-వెజ్ భోజనం తయారీ ఖర్చుది కూడా ఇదే పంథా. రోటీ, అన్నం, పప్పు బదులు చికెన్ (బ్రాయిలర్), పెరుగుతో కూడిన సాధారణ మాంసాహార భోజనం ఖర్చు గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం పెరిగింది. అయితే, బ్రాయిలర్ చికెన్ రేట్లు తగ్గడం వల్ల, ఓవరాల్ రేటులో 5% పెరుగుదల మాత్రమే కనిపిస్తోంది. నాన్-వెజ్ థాలీ ధరలో బ్రాయిలర్ వాటా 50% ఉంటుంది. అందువల్లే, కూరగాయల రేట్లు పెరిగినా మాంసాహార ప్రియులకు ఉపశమనం దొరికింది. ఉల్లి, టమాటా ధరలు పెరగడానికి ప్రధాన కారణాలు రెండు. పండుగల సీజన్ కారణంగా డిమాండ్ పెరగడం, సరైన వర్షాలు లేక ఖరీఫ్ సీజన్‌లో ఉత్పత్తి తగ్గడం. ఈ ఏడాది జనవరి-మే కాలంలో ఉల్లి, టొమాటోల రేట్లు తగ్గాయి, జులై-ఆగస్టులో పెరిగాయి. ఆగస్టు నెలలో టమాటా రేట్లు చుక్కల్లోకి చేరాయి, సామాన్య జనానికి పట్టపగలే చుక్కలు చూపించాయి. టమాటా రేట్ల వల్ల ఆ నెలలో శాఖాహార భోజనం తయారీ ఖర్చు 24% పెరిగింది. అదే సమయంలో మాంసాహార భోజనం తయారీ ఖర్చు 13% పెరిగింది. ధరలు అంటే ఫస్ట్ చెప్పాల్సింది ఆయిల్. ఆయిల్ రేట్ 2019 ప్రాంతంలో 90 రూపాయలు సుమారుగా ఉండేది. తరువాత 120 అయింది. ఇప్పుడు 220 వరకూ పెరిగింది. అది మామూలు పెరుగుదల కాదు. అసలు వంట నూనె ఇంత భారీగా పెరగడం మాటలు కాదు. మూడేళ్ల క్రితం 75-80 రూపాయలు ఉండేది పెట్రోలు. ఇప్పుడు 110 అయింది. వాస్తవానికి 120 అయితే, మొన్నామధ్య పెంచి మళ్లీ 10 రూపాయలు తగ్గించారు కదా. అంటే ఏకంగా మూడేళ్లలో 30 రూపాయల పైన పెట్రోల్ పెరిగింది.

# నేడు అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం




అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం డిసెంబరు 9 న జరుపుకుంటారు. దీనిని 2003 అక్టోబరు 31 న ఐక్యరాజ్యసమితి నిర్వహించిన "అవినీతి వ్యతిరేక సదస్సు" ద్వారా నిర్ణయించారు. అవినీతి ప్రభావం అవినీతి కారణంగా పేద ప్రజల జీవన ప్రమాణాలు మరింతగా దిగజారుతాయి. దారిద్ర్యం, వివిధ రంగాల్లో అస్థిరత పెరిగిపోతాయి. అంతిమంగా అది మౌలిక వసతుల వైఫల్యానికి, రాజ్య వైఫల్యానికి దారి తీస్తుంది. ప్రభుత్వాలు, ప్రయివేటు సంస్థలు, ఎన్జీవోలు, మీడియా, వ్యక్తులు కలసికట్టుగా అవినీతి వ్యతిరేక ఉద్యమంలో పాలుపంచుకోవాల్సి ఉంది. అవినీతి వల్ల మానవ హక్కుల ఉల్లంఘనలు, మార్కెట్ అనిశ్చితి, జీవన ప్రమాణాల నాణ్యంలో క్షీణత లాంటివి చోటు చేసుకుంటాయి. వ్యవస్థీకృత నేరాలు పెరిగిపోతాయి. కోర్టుల్లో ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేయడం, హక్కుల కమిషన్లను ఆశ్రయించడం, ఇంటర్నెట్, టీవీ, ప్రింట్ మీడియాను ఆశ్రయించడం, సమాచార హక్కు చట్టం కింద సమాచారం కోరడం వంటి వాటి ద్వారా అవినీతిని కొంతమేరకైనా తగ్గించవచ్చు. యాంటీ కరెప్షన్ సంస్థలు ఏర్పాటు చేయడం, రాజకీయ పక్షాలకు నిధులు అందించడం లో, పాలనావ్యవహారాల్లో పారదర్శకత పెంచడం, ప్రతిభ, సామర్థ్యం లాంటి అంశాల కారణంగా నియామకాలు, ప్రమోషన్లు చేపట్టడం లాంటి చర్యలు తీసుకోవాలని ఈ రంగంలో నిపుణులు సూచిస్తున్నారు. అనుమానాస్పద లావా దేవీలను గుర్తించడం, వివిధ దేశాలు పరస్పరం సహకరించు కోవడం, అన్ని రంగాల్లో అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయో గించడం లాంటి వాటి ద్వారా అవినీతిని కొంతమేరకు తగ్గించవచ్చు. ఎన్నికల రాజకీయ వ్యవస్థలో అవినీతి తొలగించేందుకు సంస్కరణలు చేపట్టాలి. ప్రతీ కార్యాలయంలో సేవల వివరాలు అవి పొందే విధి విధానాలు ఏ పని ఎన్నిరోజుల్లో చేస్తారో వివరించే ఫిజికల్ చార్టర్‌లు చాలా శాఖల్లో ప్రకటించారు. వీటిని సక్రమంగా అమలుజరిగేలా కార్యాచరణ ఉండాలి. పారదర్శకతకోసం సమాచార హక్కు చట్టం ద్వారా పూర్తి సమాచారం ప్రజలకు తెలుసుకునే వీలు కలిగింది. దీన్ని సక్రమంగా వినియోగించుకుంటే అవినీతి దూరమవుతుంది. కేంద్రీకృత పాలన అవినీతికి మూలమైంది. దీనికి విరుగుడుగా అధికార వికేంద్రీకరణ జరగాల్సి ఉంది. జవాబుదారీతనంతో స్థానిక ప్రభుత్వాలు సాధించాలి. మనదేశాన్ని మనమే రక్షించుకునే దిశగా ప్రతీఒక్కరూ అవినీతికి వ్యతిరేకంగా ప్రతిన బూనాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# కాళేశ్వరంపై ఏసీబీకి ఫిర్యాదు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణలో అత్యంత ప్రతిష్టాత్మకంగా బీఆర్ఎస్ సర్కార్ చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ అవినీతి జరిగిందని విచారణ చేపట్టాలని తెలంగాణ ఏసీబీకి ఫిర్యాదు అందింది. హైదరాబాద్‌కు చెందిన న్యాయవాది రాపోలు భాస్కర్ మాజీ సీఎం కేసీఆర్, హరీశ్‌రావు, కవిత, మేఘా కృష్ణారెడ్డి, ఇంజనీర్ ఇన్ చీఫ్ వెంకటేశ్వర్లపై కేసు నమోదు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఫేక్ ఎస్టిమేషన్ల ద్వారా వేలాది కోట్లు దోపిడీ జరిగిందని భాస్కర్ చెప్పారు. తాగు, సాగునీటి ప్రాజెక్టు పేరిట ఆర్థిక అవతవకలకు పాల్పడ్డారని భాస్కర్ తెలిపారు. ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి విచారణ జరపాలని కోరారు.తాగు, సాగు నీటి ప్రాజెక్టు పేరుతో కాళేశ్వరం ప్రాజెక్టులో భారీగా ఆర్థిక అవతవకలు జరిగాయని, నకిలీ ఎస్టిమేషన్ల ద్వారా వేలాది కోట్ల ప్రజాధనం దోపిడీకి గురైందని ఆరోపించారు. తెలంగాణ ప్రాంతంలోని ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్, వరంగల్, నల్గొండ, రంగారెడ్డి జిల్లాలకు తాగునీరు, సాగునీరు అందించేందుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే నిర్ణయం జరిగిందన్నారు. మొత్తం ప్రాజెక్టు పనులు 7 లింకుల కింద 228 ప్యాకేజీలు నాటి ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని అయితే పనులు జరుగుతున్న సమయంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడి ముఖ్యమంత్రిగా కేసీఆర్, మంత్రులుగా హరీష్ రావు, కేటీఆర్, ఎంపీగా కవిత ఎన్నికయ్యారని ఆ తర్వాత వీరంతా ప్రాజెక్టు అలైన్మెంట్లు, డిజైన్లు మార్చివేసి కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిని, అంచనాలను పెంచారని ఆరోపించారు. మొత్తంగా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం పేరుతో వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దోచుకోవాలని ప్రణాళిక రచించారని దీనిపై కేసు నమోదు చేసి సమగ్ర దర్యాప్తు జరిపించాలని కోరారు. ఇలా ప్రభుత్వం మారగానే అలా ఏసీబీకి ఫిర్యాదు చేయడం సంచలనంగా మారింది. కేసీఆర్ ప్రభుత్వం.. కాళేశ్వరంలో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడిందని కాంగ్రెస్ ఆరోపిస్తోంది.

తాము వచ్చిన తర్వాత అవినీతిని బయటకు తీస్తామని ఆ సంపదను ప్రజలకు పంచుతామని ఎన్నికల ప్రచారంలో చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోగా, అన్నారం బ్యారేజీ వద్ద లీకులు కనిపించాయి. కాళేశ్వరం పేరుతో కేసీఆర్ భారీ ఎత్తున అవినీతికి పాల్పడ్డారని ఆరోపించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తొలిరోజే ఏసీబీకి ఈ ఫిర్యాదు రావడంతో ఎటువంటి చర్యలు ఉండబోతున్నాయనేది ఉత్కంఠగా మారింది.కాళేశ్వరం ప్రాజెక్టు దాదాపుగా లక్ష కోట్ల రూపాయల ప్రాజెక్టు .

మేఘా కంపెనీ రాష్ట్రంలో ఎన్నో ప్రాజెక్టులు చేపడుతుంది. ఈ సంస్థలపై ఫిర్యాదు వెళ్లడంతో ఏం జరగబోతోందోనన్న చర్చ ప్రారంభమయింది. తెలంగాణ మంత్రులు సహా అనేక మందిపై తీవ్రమైన అవినీతి ఆరోపణలు ఉన్నాయి. ఎవర్నీ వదిలి పెట్టే అవకాశం ఉండదని కాంగ్రెస్ వర్గాలు ఇప్పటికే ప్రకటించాయి.

# తొలి కేబినెట్‌లో సోషల్ ఇంజనీరింగ్

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు




తెలంగాణలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది.అశేష జనవాహిని మధ్య ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి, ఆ తర్వాత డిప్యూటీ సీఎంగా మల్లు భట్టి విక్రమార్క ప్రమాణస్వీకారం చేశారు. మంత్రులుగా ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహా, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావులు వరుసగా ప్రమాణస్వీకారం చేశారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేబినెట్‌లో ముగ్గురు రెడ్లకు చోటు లభించింది. మంత్రులుగా ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేశారు. ఎస్సీల్లో మాల సామాజిక వర్గానికి చెందిన భట్టి విక్రమార్కకు డిప్యూటీ పదవి లభించింది. మరో మాదిగ సామాజిక వర్గానికి చెందిన దామోదర రాజనర్సింహాకు మంత్రి లభించింది. ఎస్టీల్లో ఆదివాసీ వర్గం నుంచి సీనియర్ అయిన ధనసరి అనసూయ అలియాస్ సీతక్కకు కేబినెట్‌లో చోటు లభించింది. బీసీల్లో గౌడ సామాజిక వర్గానికి చెందిన పొన్నం ప్రభాకర్, పద్మశాలి వర్గానికి చెందిన కొండా సురేఖకు చోటు దక్కింది. బ్రాహ్మణ సామాజికవర్గం నుంచి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కమ్మ సామాజికవర్గం నుంచి తుమ్మల నాగేశ్వరరావు, వెలమ సామాజిక వర్గం నుంచి జూపల్లి కృష్ణారావు ప్రమాణస్వీకారం చేశారు. కేబినెట్ కూర్పులో సామాజిక సమతూల్యం పాటించింది కాంగ్రెస్ పార్టీ. మంత్రివర్గంలో ఆరుగురు ఓసీలు ఉంటే...బీసీలు ఇద్దరు, ఎస్సీలు ఇద్దరు, గిరిజనులు ఒకరు ఉన్నారు. తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌గా మాల సామాజిక వర్గానికి చెందిన వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ ఖరారయ్యారు. అయితే ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల నేతలకు కేబినెట్‌లో చోటు లభించలేదు. ఈ జిల్లాల నుంచి పలువురు నేతలు ఎమ్మెల్యేలుగా గెలుపొందినప్పటికీ...సామాజిక సమీకరణాల భాగంగా పరిగణలోకి తీసుకోలేదని తెలుస్తోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి సీనియర్ నేతలు చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకట్‌స్వామి, మాజీ మంత్రి గడ్డం వినోద్, ప్రేమ్‌సాగర్‌రావు కేబినెట్‌లో చోటు ఆశించారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి సీనియర్ నేత, మాజీ మంత్రి, బోధన్ నుంచి గెలుపొందిన సుదర్శన్‌రెడ్డి కూడా మంత్రివర్గంలోకి తీసుకుంటారని భావించారు.రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం సీనియర్ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి...కేబినెట్‌లో అవకాశం లభిస్తుందని ఆశించారు. వీరికి కూడా అమాత్య పదవి దక్కలేదు. హైదరాబాద్‌లో ఒక్కరు కూడా కాంగ్రెస్ పార్టీ తరపున గెలుపొందలేదు. ఏడుగురు బీఆర్ఎస్, మరో ఏడుగురు ఎంఐఎం, బీజేపీ తరపున ఒకరు ఎన్నికయ్యారు. రంగారెడ్డి జిల్లా, ఎస్సీ సామాజికవర్గం నుంచి మంత్రి పదవి ఆశించిన మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్‌కు...స్పీకర్ పదవి దక్కింది. ఉమ్మడి రంగారెడ్డి, ఉమ్మడి నిజామాబాద్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలను కేబినెట్ విస్తరణలో మంత్రివర్గంలోకి తీసుకునే అవకాశం ఉందని అంటున్నారు. ముఖ్యమంత్రితో పాటు 11 మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. మరో ఆరు మంత్రి పదువులు ఖాళీగా ఉన్నాయి. ఎవరెవర్ని తీసుకుంటారన్న దానిపై తెలుగు రాష్ట్రాల్లో ఆసక్తి రేపుతోంది. కేబినెట్‌లో ఖమ్మం జిల్లాకు మూడు, కరీంనగర్, వరంగల్, నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాలకు రెండేసి పదవులు దక్కాయి. మెదక్ నుంచి దామోదరకు చోటు లభించింది.

# మాజీ సీఎం కేసీఆర్కు గాయం.. ఆస్పత్రిలో చికిత్స



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కాలుజారి పడటంతో గాయమైయింది. గురువారం అర్ధరాత్రి ఘటన జరిగింది. అర్ధరాత్రి రెండు గంటల సమయంలో ఆయనను హుటాహుటిన సోమాజిగూడలోని యశోద ఆసుపత్రికి తరలించారు. కేసీఆర్ తుంటి ఎముక విరిగినట్లు వైద్యులు వెల్లడించారు. . శస్త్రచికిత్స అవసరం అవుతుందని సూచించారు.కేసీఆర్ తుంటి ఎముక రెండు చోట్ల విరిగినట్టు వైద్యులు గుర్తించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని పేర్కొన్నారు. విషయం తెలియగానే కేసీఆర్ కుటుంబసభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి తరలివెళ్లారు. కేటీఆర్, హరీశ్ రావు, కవిత కుడా ఆసుపత్రికి వెళ్లి వైద్యులతో చర్చించారు. ఎమ్మెల్సీ కవిత ఎక్స్ (ట్విట్టర్) వేదికగా స్పందిస్తూ... కేసీఆర్ కి స్వల్ప గాయం అయిందని... ప్రస్తుతం ఆయన ఆసుపత్రిలో వైద్య నిపుణుల పర్యవేక్షణలో ఉన్నారని తెలిపారు. అందరి ప్రార్థనలు, ఆకాంక్షలతో నాన్న త్వరలోనే కోలుకుంటారని చెప్పారు.

# ఆరు గ్యారంటీలు అమలు ఎలా..




హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

కర్ణాటకలో జెండా ఎగరవేసిన కాంగ్రెస్? ఆ తర్వాత తెలంగాణనే పెట్టుకుంది. అందుకు తగ్గటే వర్కౌట్ చేసింది. పక్కా వ్యూహాలతో ముందుకొచ్చింది. అనుకున్నట్లే? తెలంగాణ గడ్డపై కాంగ్రెస్ జెండాను ఎగరవేసింది. ఏడాది కాలంగా? కీలకమైన డిక్లరేషన్లతో పాటు? హామీలతో ప్రజల్లోకి వెళ్లే పని పెట్టుకున్న కాంగ్రెస్?. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ను దెబ్బకొట్టింది. తొలిసారిగా తెలంగాణలో అధికారంలోకి వచ్చింది. అయితే? కాంగ్రెస్ అధికారంలోకి రావటంలో ఆ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీ కార్డే కీలకంగా మారిందనే చెప్పొచ్చు.తొలిసారిగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్? గురువారం అధికారికంగా సీఎంతో పాటు మంత్రులు ప్రమాణస్వీకారం చేశారు. ప్రమాణం సందర్భంగా? సీఎం రేవంత్ రెడ్డి తొలి సంతకం కూడా ఆరు గ్యారెంటీల హామీలపైనే చేశారు. అంతేకాదు? సచివాలయంలో తొలి కేబినెట్ భేటీ జరిగింది. ఇందులో కూడా ఆరు గ్యారెంటీల హామీల అమలుపైనే చర్చించారు. ఫలితంగా కాంగ్రెస్ ప్రభుత్వం తొలి ప్రాధాన్యం? ఆరు గ్యారెంటీల హామీల అమలే అని అర్థమవుతోంది.

**కాంగ్రెస్ ప్రకటించిన 6 గ్యారెంటీలు :**

**1. మహాలక్ష్మి**
**- ఈ పథకం కింద ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం.**
**- రూ.500లకే గ్యాస్ సిలిండర్.**
**- రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం.**
**2. రైతు భరోసా**
**-ఏటా రైతులు, కౌలు రైతులకు ఎకరానికి రూ.15,000 పెట్టుబడి సాయం.**
**-ఏటా వ్యవసాయ కూలీలకు రూ.12,000 ఆర్థిక సాయం.**
**-వరి పంటకు అదనంగా రూ.500 బోనస్ ప్రకటన.**
**3. గృహజ్యోతి**
**- ఈ పథకం కింద ఇళ్లల్లో వాడే 200 యూనిట్ల కరెంటు ఉచితం.**
**4. ఇందిరమ్మ ఇళ్లు**
**- ఇళ్లు లేని పేదలకు ఇంటి స్థలం ఇవ్వడంతోపాటు ఇంటి నిర్మాణానికి రూ.ఐదు లక్షల ఆర్థిక సాయం.**
**- తెలంగాణ ఉద్యమకారులకు 250 చదరపు గజాల ఇంటిస్థలం.**
**5. యువ వికాసం**
**- విద్యా భరోసా కార్డు కింద విద్యార్థులకు రూ. 5 లక్షల పరిమితితో విద్యా భరోసా కార్డు.**
**- ప్రతి మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూళ్ల ఏర్పాటు.**
**6. చేయూత**
**- పింఛనుదారులకు నెలకు రూ.4,000 పింఛను.**
**- ఆరోగ్య శ్రీ కింద రూ.10 లక్షల ఇన్సూరెన్స్ సదుపాయం**

కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల హామీల అమల్లో ఉన్న 'మహాలక్ష్మి' స్కీమ్ పై అప్పుడే చర్చ మొదలైంది. రూ.500లకే గ్యాస్ సిలిండర్ ఇవ్వటంతో పాటు బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అనేది ఎప్పట్నుంచి ప్రారంభమవుతుందనే దానిపై చర్చ నడుస్తోంది. ఇప్పటికే రైతుబంధు నిధుల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. రైతుభరోసా ప్రకటించిన కాంగ్రెస్ సర్కార్? ఎప్పుడు ఈ నిధులను జమ చేస్తుందనేది కూడా ఆసక్తికరంగా మారింది. ఒకవేళ జమ చేస్తే? కౌలు రైతులను కూడా పరిగణనలోకి తీసుకుంటారా అనే దానిపై కూడా చర్చ షురూ అయింది. ఇవేకాకుండా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పాటు? ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్ల పెంపు కూడా కాంగ్రెస్ ప్రభుత్వానికి అతిపెద్ద సవాల్ అనే విశ్లేషణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే వీటన్నింటి విషయంలో రేవంత్ నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కార్? ఎలాంటి కార్యాచరణతో ముందుకెళ్లబోతుందనేది టాక్ ఆఫ్ ది పాలిటిక్స్ గా మారిందనే చెప్పొచ్చు?!

## సీఎం రేవంత్‌ను కలిసిన టీఎన్జీవో నేతలు

### సీఎం రేవంత్‌ను కలిసిన టీఎన్జీవో నేతలు



**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు:** ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డిని టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్ ఆధ్వర్యంలో అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, ఎం సత్యనారాయణగౌడ్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ముజీబ్ హుస్సేని, నాయకులు పర్వతాలు, శంకర్ తదిత రులు శుక్రవారం హైదరాబాద్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి అభినందనలు ప్రకటించారు. ప్రజల ఆకాంక్షల మేరకు కాంగ్రెస్ అధికారంలోకి రావడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగుల ఆకాంక్షలకనుగుణంగా అనేక హామీలను మ్యానిఫెస్టోలో చేర్చిన కారణంగానే కొత్త ప్రభుత్వం ఏర్పడిందని తెలిపారు. రాష్ట్రాభివృద్ధి కోసం ఉద్యోగులుగా ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని పేర్కొన్నారు.

# ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి అభినందనల వెల్లువ

**- కాంగ్రెస్ పార్టీ నాయకులు కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, మాదగోని జంగయ్య గౌడ్ - ఇందిరమ్మ రాజ్యం వచ్చింది**
**- 6 గ్యారంటీ పథకాలు అమలు చేస్తుంది - ప్రజలను అన్ని విధాలుగా కాంగ్రెస్ పార్టీ ఆదుకుంటుంది**



**మంచాల - ప్రభాత సూర్యుడు:** ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి భారీ మెజార్టీతో గెలవడంతో ఆరుట్ల గ్రామ శాఖ అధ్యక్షులు రావుల భాష ఆధ్వర్యంలో ఆరుట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి తొర్రూరు గ్రామంలో మల్ రెడ్డి రంగారెడ్డి క్యాంప్ కార్యాలయంలో మల్ రెడ్డి రంగారెడ్డిని కలిసి పుష్పగుచ్ఛమిచ్చి శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపిన ఆరుట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి మాధగోని జంగయ్య గౌడ్ మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో40 ఏండ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా గెలుపొంది చరిత్ర సృష్టించిన డైనమిక్ ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో నిజమైన ఇందిరమ్మ రాజ్యం వచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలనలో ఇందిరమ్మ రాజ్యం ఇంటింటా సౌభాగ్యం లాగా తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఇబ్రహీంపట్నం నియోజకవర్గం పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తాడని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఎన్నికలలో చేసిన వాగ్దానం ప్రకారం ఆరు గ్యారెంటీల పథకాలు అమలు చేస్తుందని ప్రజలను అన్ని విధాలుగా ఆదుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు సుంకరి పాండుగౌడ్, అనంగల యాదయ్య, కిసాన్ సెల్ మండల అధ్యక్షులు కావలి బుగ్గ రాములు ముదిరాజ్, మారగొని రాజయ్య గౌడ్, ఎంపీటీసీ కావాలి శ్రీనివాస్ ముదిరాజ్, పంబాల బుగ్గ రాములు, గుడ్డిమల్ల చంద్రయ్య ముదిరాజ్, మాధగోని జంగయ్య గౌడ్, కంబాలపల్లి బుగ్గ రాములు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మల్ రెడ్డి రంగారెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన జాపాల కాంగ్రెస్ పార్టీ నాయకులు



**మంచాల - ప్రభాత సూర్యుడు :** మంచాల మండల్ జాపాల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మల్ రెడ్డి రంగారెడ్డిని శాలువాతో సన్మానం చేసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి విజయం కోసం కష్టపడిన ప్రతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తను గుర్తుంచుకొని ఇబ్రహీంపట్నం నియోజకవర్గాన్ని అభివృద్ధి దిశలో తెస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఆవుల మల్లేష్, గ్రామ శాఖ అధ్యక్షుడు సొప్పరి దశరథ ముదిరాజ్, ఓరుగంటి లింగం గౌడ్, ఓరుగంటి మహేష్ గౌడ్, కురుమ బిక్షపతి, నోముల కృష్ణ, మాదం శంకర్, నోముల పరమేష్, మంథని పరమేష్, చేతాల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ ప్రత్యేక పూజలు





**చిన్న శంకరంపేట్- ప్రభాత సూర్యుడు :** ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత మొట్టమొదటిసారిగా మెదక్ పట్టణానికి విచ్చేసిన సందర్భంగా ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావుకు నియోజకవర్గ ప్రజలు ఘనంగా ఆహ్వానం పలికారు. క్యాంపు కార్యాలయం ప్రవేశం సందర్భంగా ఎమ్మెల్యే కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు ,హెూమం , శ్రీ లలిత త్రిపుర సుందరి మాతకు పంచామృతాభిషేకం పుష్ప అభిషేకం కుంకుమార్చన వేద పండితుల ద్వారా నిర్వహించడం జరిగింది. అనంతరం మల్కాజ్ గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు తిరుపతి వెళ్ళిన సమయంలో బి ఆర్ ఎస్ ప్రభుత్వం కూలిపోవాలని మెదక్ లో నా కుమారుడు మైనంపల్లి రోహిత్ రావ్ కచ్చితంగా గెలవాలని వెంకటేశ్వర స్వామిని కోరుకోవడం జరిగిందని అలాగే జరిగిందని ఆయన అన్నారు. మళ్లీ కుటుంబ సమేతంగా తిరుపతి త్వరలో వెళ్తున్నామని వెంకటేశ్వర స్వామికి కృతజ్ఞతలు తెలుపాలని ఆయన తెలియజేశారు. తర్వాత శంకరంపేట వార్డు మెంబర్ మేడి గణేష్ ముదిరాజ్ తో పాటు ముఖ్య నాయకులు ఎమ్మెల్యే రోహిత్ రావుకు పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సన్మానిం చడం జరిగింది. ఈ కార్య క్రమంలో శంకరంపేట సర్పంచ్ రాజిరెడ్డి ,ఉపసర్పంచ్ జీవన్ , రామయంపేట మాజీ ఏఎంసీ చైర్మన్ గంగా నరేందర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆవుల గోపాల్ రెడ్డి, మాజీ సర్పంచులు ఎడ్ల కిష్టయ్య , సుధాకర్ ,రంగారావు, నాయకులు చేగుంట శ్రీకాంత్ , ఎర్రి కుమార్ , మేడి శ్రీమన్ నియోజకవర్గ కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి శుభాకాంక్షలు వెలువ

**యాచారం - ప్రభాత సూర్యుడు :** యాచారం మండల పరిధిలోని వివిధ గ్రామాల నుండి ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి వివిధ గ్రామ సర్పంచులు ,ఎంపీటీసీలు, వార్డ్ మెంబర్లు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీ ఎత్తున తరలి వెళ్లి తొర్రూరు క్యాంపు కార్యాలయంలో మల్ రెడ్డి రంగారెడ్డికి అభినందనలు తెలియజేస్తూ శాలువాతో సన్మానించి స్వీట్ల పంపిణీ చేసి ఉత్సాహంగా శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో యాచారం మాజీ ఎంపీపీ జ్యోతి శ్రీనివాస్ నాయక్, మంతన్ గౌరెల్లి ఎంపిటిసి కొర్ర జ్యోతి అరవింద్ నాయక్, నాయిని సుదర్శన్ రెడ్డి, ఉప్పల భాస్కర్, కడారి యాదయ్య, మధుకర్ నాయక్, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215